

గద్వాల రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

# 'అమృత్ భారత్ స్టేషన్'కు గద్వాల ఎంపిక

- ఇది శుభపరిణామం: ఎంపీ పోతుగంటి రాములు
- వంద ఎకరాలను సుందరంగా తీర్చిదిద్దాలి : గద్వాల ఎమ్మెల్యే బండ్ల

గద్వాల, ఫిబ్రవరి 26 : జోగుళాంబ గద్వాల రైల్వేస్టేషన్ అమృత్ భారత్ కింద ఎంపిక కావడం శుభపరిణామమని ఎంపీ రాములు అన్నారు. సోమవారం పీఎం మోదీ ఢిల్లీ నుంచి 554 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి, 1,500 ఆర్వోబీలు, అండర్‌పాస్ పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల రైల్వేస్టేషన్‌లో ఎంపీ రాములు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రైల్వే అధికారులు పాల్గొని మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ గద్వాల రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.9.49 కోట్లు మంజూరు చేసిన ప్రధానికి అభినందనలు తెలిపారు. ఈ రైల్వేస్టేషన్‌కు వంద ఎకరాల స్థలం ఉందని, ఆ స్థలం వృథా కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని రైల్వే అధికారులకు సూచించారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని 554 స్టేషన్లలో గద్వాల ఒకటి కావడం, ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. గద్వాల రైల్వే స్టేషన్ మీదుగా 20 కొత్త రైళ్లు నడుస్తున్నాయని, ప్రతి రైలు ఇక్కడ ఆపేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 2013లో రాయిచూర్ రైల్వేలైన్ పూర్తి అయిందని, డోన్ వరకు డబ్లింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ రైల్వేస్టేషన్‌కు గద్వాల మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ వంద ఎకరాల స్థలం ఇచ్చారని, దానిని సుందరంగా తీర్చిదిద్దాలని రైల్వే అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వికసిత భారత్, వికసిత రైల్వే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. డివిజన్ రైల్వే అధికారి అరుణ్‌కుమార్‌శర్మ మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్‌లో ప్రధాన ద్వారంతోపాటు ప్రయాణ ప్రాంగణం, సమాచార సూచికలు, వెయిటింగ్ హాల్, ఎస్కలేటర్, వన్ స్టేషన్, వన్‌ప్రాడక్ట్, అప్‌గ్రేడ్ పార్కింగ్, దివ్యాంగులకు అనుకూలమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, రైల్వేస్టేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి

# రైల్వే రంగంలో భారీ సంస్కరణలు

- మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో ఆధునీకరణ పనులకు శంకుస్థాపన

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 26 : మౌలిక సదుపాయాల కల్పనలో భారతీయ రైల్వే భారీ పరివర్తన దిశగా పురోగమిస్తున్నదని, గడిచిన పదేండ్లలో రైల్వే రంగం వేగవంతంగా పురోగతి సాధించిందని పాలమూరు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జడ్చర్ల రైల్వే స్టేషన్ ఆధునీకరణకు రూ.10.94 కోట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టేషన్ ఆధునీకరణ పనులను పీఎం మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం ఎంపీ మాట్లాడారు. రైల్వేరంగంలో ప్రధాని భారీ సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం గత పదేండ్లలో రాష్ట్రానికి రైల్వేబడ్జెట్‌లో దాదాపు రూ.5,071 కోట్లు కేటాయించిందన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజలకు ఉపయోగకరమైన సేవలు అందించాలని సూచించారు. ప్రజలందరికీ మంచి చేస్తున్న నరేంద్ర మోదీకి ధన్యావాదాలు తెలియజేశారు. అనంతరం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ యాదయ్య, మాజీ మంత్రి డీకే అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్ సారిక, రైల్వే అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### అందుబాటులోకి 'అండర్‌పాస్'

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఫిబ్రవరి 26 : అండర్‌పాస్ రైల్వే బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో ప్రజలకు ప్రయాణ భారం తగ్గిందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని అప్పన్నపల్లి వద్ద నిర్మించిన అండర్‌పాస్ రైల్వే బ్రిడ్జిని సోమవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్ రామాంజనేయులు, హనీఫ్ అహ్మద్, సాదుల్లా తదితరులు పాల్గొన్నారు.



సప్తాహ భజనలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా

# శివాలయంలో సప్తాహం ప్రారంభం

- హాజరైన ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అలంపూర్, ఫిబ్రవరి 26 : మహాశివరాత్రిని పురస్కరించుకొని అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరాలయంలో సోమవారం ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సప్తాహ భజనలను ప్రారంభించారు. రాత్రి, పగలు తేడా లేకుండా వారంపాటు నిరంతరం కొనసాగే కార్యక్రమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి 60 బృందాలు పాల్గొంటాయని నిర్వాహకులు కోనేరు చిన్న కృష్ణయ్యనాయుడు తెలిపారు. ఆలయంలో సప్తాహం నిర్వహించడం ఈ ఏడాదితో 18వ సారి అని ఆయన తెలిపారు. అనంతరం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారి ఆలయాల్లో నివేదన కార్యక్రమానికి హాజరుకాగా, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తిరుగు ప్రయాణంలో బూర్దిపాడు సర్కిల్ వద్ద అలంపూర్ దేవస్థానం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శివనంది విగ్రహ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నంది విగ్రహ దాత రమేశ్‌ను సన్మానించారు.

# సన్నాహక సమావేశం సక్సెస్

- తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులకు ధన్యవాదాలు : గువ్వల బాలరాజు

అచ్చంపేట, ఫిబ్రవరి 26 : అచ్చంపేటలో ఏర్పాటుచేసిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి భారీగా తరలివచ్చి సక్సెస్ చేసిన బీఆర్ఎస్ శ్రేణులకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆయన స్వగృహం నుంచి వీడియో సందేశాన్ని పంపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరైన సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి స్వచ్ఛందంగా వచ్చిన కార్యకర్తలు, అభిమానులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశం విజయవంతం కావడంపై కేటీఆర్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు గువ్వల గుర్తు చేశారు. బీఆర్ఎస్ శ్రేణులకు తాను అందుబాటులో ఉంటానని, ఎవరికి ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసానిచ్చారు. పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.


నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 27 ఫిబ్రవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


### నీళ్లు రాక పంట వేయలేదు..

నాకు రెండెకరాల పొలం ఉంది. బోరు ద్వారా వ్యవసాయం చేసుకుంటున్న. ఇప్పుడు బోరులో నీళ్లు బాగా తగ్గినయ్. డిసెంబర్ నుంచే నీళ్లు తగ్గడంతో సాగు చేయడం కష్టమనిపించింది. ప్రతిసారి రెండెకరాల్లో వరి పంట సాగు చేస్తుంటి. బోరు నుంచి నీళ్లు గుక్కబట్టి వస్తున్నయ్. నష్టం వస్తుందని అర్థమై ఈసారి పంట వేయలేదు. ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుదల చేస్తలేరు కాబట్టి బోరులో నీళ్లు తగ్గినయ్. పోయిన ఏడాది ఎండాకాలం కూడా బోరు పుల్లుగా పోసింది. ఈసారి డిసెంబర్ నుంచే నీళ్లు తగ్గినయ్. మార్చి, ఏప్రిల్‌లో చుక్క నీరు కూడా వచ్చేటట్టు లేదు. ఇలాగే ఉంటే వ్యవసాయం చేయడం కష్టమైతది.

*- బయ్యన్న, రైతు, పెద్దకొత్తపల్లి, నాగర్‌కర్నూల్ జిల్లా*






**నాగర్‌కర్నూల్ జిల్లాలో యాసంగి సాగు వివరాలు..**

| సంవత్సరం | సాగు విస్తీర్ణం |
|---|---|
| 2016 | 1,30,272 |
| 2017 | 1,79,233 |
| 2018 | 1,59,991 |
| 2019 | 2,25,448 |
| 2020 | 3,06,897 |
| 2021 | 2,55,617 |
| 2022 | 3,12,096 |
| 2023 | 2,30,893 |

నాగర్‌కర్నూల్ మండలం వనపట్ల గ్రామ శివారులో నీళ్లు లేకపోవడంతో వట్టిపోయిన కాల్వ


- యాసంగి సాగుకు రైతన్నల కష్టాలు
- నిలిచిన ఎంజీకేఎల్ఐ నీటి సరఫరా
- అడుగంటిన రిజర్వాయర్లు, చెరువులు
- భూగర్భ జలాలు తగ్గి గుక్కపట్టి పోస్తున్న బోర్లు
- వ్యవసాయంపై కొరవడిన సర్కారు దూరదృష్టి
- రాజకీయ ఆరోపణలకే పరిమితమైన కాంగ్రెస్ ప్రభుత్వం
- భవిష్యత్తుపై బెంగపెట్టుకున్న అన్నదాత

# సగానికి సాగు..

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయంపై సర్కారు దూరదృష్టి కొరవడింది. యాసంగి సాగుపై ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో పంటల విస్తీర్ణం సగానికి తగ్గగా.. రైతన్నలు భవిష్యత్తుపై బెంగ పెట్టుకున్నారు. ఎంజీకేఎల్ఐ నీళ్లు నిలిచిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడంతో యాసంగి సాగు పడిపోయింది. దీంతో రాబోయే కాలంలో 'సాగుబడి' దిగుబడిగా కాకుండా దిగాలుగా మారుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### నాడు సంబురం.. నేడు వేదన..

నాగర్‌కర్నూల్ జిల్లాలో కేసీఆర్ సర్కారు హయాంలో సంబురంగా మారిన సేద్యం.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో సన్నగిల్లుతున్నది. ప్రస్తుతం సాగుపై సర్కారు చిత్తశుద్ధి కొరవడడంతో యాసంగి విస్తీర్ణం తగ్గిపోయింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి ప్రతి వానకాలం, యాసంగిలోనూ సాగుబడి పెరుగుతూ వచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఎంజీకేఎల్ఐని పూర్తి చేయడంతో 2016లో 1.30 లక్షల ఎకరాలున్న సాగు విస్తీర్ణం 3.50 లక్షల ఎకరాలకు చేరింది. ఎంజీకేఎల్ఐని పూర్తి చేయడంతో జొన్నలబొగుడ, సింగోటం, గుడిపల్లి రిజర్వాయర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడి నుంచి నీటిని జిల్లాలోని చెరువులు, కుంటల్లోకి మళ్లించారు. ఇలా ఏడాదికి రెండు పంటలకు కలిపి జిల్లాలో దాదాపు 9 లక్షల ఎకరాల్లో పంటల సాగు చేపట్టడం గమనార్హం. ఈ క్రమంలో సమైక్య పాలనలో బీళ్లుగా ఉన్న భూములు పచ్చని పంటలతో మాగాణులుగా మారాయి. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట ప్రాంతాల్లో చాలా భూములు కంపచెట్లు, చెరువుల సమీపంలో సర్కారు తుమ్మ, లొట్టపీసు చెట్లు, తంగేడు చెట్లతో బీళ్లుగా, చిన్న అడవులను తలపించేవి. గడిచిన పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయంపై ముందుచూపుతో పంటల సీజన్‌కు ముందే ఎంజీకేఎల్ఐ ద్వారా నీళ్లను చెరువుల్లోకి ఎత్తిపోశారు. దీంతో రైతులు ముందస్తుగా వరి నారు సిద్ధం చేసుకోవడం, దుక్కులు దున్నే పనుల్లో నిమగ్నమయ్యేవారు. అప్పటికే ఎరువులు కూడా అందుబాటులో ఉంచడంతో సాగు సంబురంగా జరిగేది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో యాసంగి సాగుపై చిత్తశుద్ధి కరువైంది. సాగుకు సిద్ధమైన రైతులను సర్కారు పట్టించుకోకుండా ఆరుగ్యారెంటీలు, ఇతర రాజకీయ ఆరోపణలకే పరిమితమవుతూ వస్తున్నది. ఈక్రమంలో ఎంజీకేఎల్ఐ నుంచి నీటి విడుదలను విస్మరించడంతో చెరువుల్లో నీళ్లు తగ్గాయి. ఈ విషయాన్ని ముందే పసిగట్టిన రైతాంగం యాసంగి సాగును బాగా తగ్గించుకున్నారు. జిల్లాలో 2022 యాసంగిలో 3,12,096 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. 2023 సీజన్‌లో 3,15,919 ఎకరాల్లో సాగు జరుగుతుందని ఊహించగా 2,30,893 ఎకరాలకే పరిమితమైనట్లు అధికారులు అంచనా వేశారు. దాదాపు లక్ష ఎకరాల విస్తీర్ణం తగ్గడం గమనార్హం. పంటలు చేతికొచ్చే సమయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసం ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేయాలి. కాగా, గత వానకాలంలో ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా స్వీకరించకుండా వ్యాపారులకు విక్రయించింది. ఈసారి కూడా అదే జరిగే పరిస్థితి కనిపిస్తున్నది. ఫలితంగా వ్యవసాయంపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందన్న ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.



తెలకపల్లి మండలం పెద్దూరు శివారులో వట్టిపోయిన కాల్వ

అడుగంటిన గుడిపల్లి రిజర్వాయర్

కొల్లాపూర్ మండలం ఎల్లూరు వద్ద నిలిచిన ఎంజీకేఎల్ఐ లిఫ్ట్

# యాసంగిపై నీలినీడలు

- జూరాలకు వరద వచ్చినా రిజర్వాయర్లు నింపని అధికారులు
- వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల
- ఈ యాసంగిలో జోగుళాంబ గద్వాల జిల్లాలో 31,303 ఎకరాలు తగ్గిన సాగు విస్తీర్ణం




నీళ్లు లేకపోవడంతో ధరూర్ మండలం మార్లబీడు శివారులో నెర్రెలుబారిన వరి పొలం

గద్వాల, ఫిబ్రవరి 26 : వానకాలం పంట కన్నీళ్లను మిగల్చగా కోటి ఆశలతో యాసంగి సాగుకు సిద్ధమవుతున్న రైతన్న ఆశలు ఆవిరయ్యాయి. జిల్లాలోని రిజర్వాయర్, చెరువుల్లో నీరు లేక పోవడంతో భూగర్భజలాలు తగ్గాయి. దీంతో బోరుబావుల్లో నీటి లభ్యత మందగించడంతో అన్నదాతకు ఏమి చేయాల్లో పాలుపోవడం లేదు. ఈ ఏడాది జూరాల, ఆర్డీఎస్, తుమ్మిళ్ల లిఫ్ట్ కింద రిజర్వాయర్‌లో నీరు లేని కారణంగా అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించారు. బోర్ల కింద అయినా పంటలు సాగు చేసుకుందామంటే నీటి లభ్యత తగ్గడంతో రైతులు యాసంగికి అనుకున్న స్థాయిలో సిద్ధం కాలేదు. 2020 నుంచి 2022-2023 వరకు ప్రతి ఏడాది జిల్లాలో యాసంగి సాగు పెరుగుతూ వచ్చింది. కాగా ఈ యాసంగిలో సాగు విస్తీర్ణం తగ్గడంతో సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. వానకాలంలో జూరాలకు వరదలు వచ్చిన సమయంలో అధికారులు రిజర్వాయర్లు, చెరువులు నింపి ఉంటే ఈ ఏడాది యాసంగి సాగు విస్తీర్ణం పెరిగేది. అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు విడుదల చేయడంతో ప్రస్తుతం రిజర్వాయర్లలో నీటి నిల్వలు నిండుకున్నాయి. జూరాల ప్రాజెక్టులో మిషన్ భగీరథకు సరిపడా నీళ్లు ఉండగా నెట్టెంపాడ్ ప్రాజెక్టు కింద కేవలం ఐదువేల ఎకరాలకు మాత్రమే నీరు అందించే అవకాశం ఉందని అధికారులు ప్రతిపాదించారు. గత ప్రభుత్వం రైతుల సంక్షేమానికి వినూత్న పథకాలు, సాగునీటిని అందించేందుకు చేపట్టిన ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నుంచి చెరువులకు నీటి విడుదలతో గతంలో సాగు పెరిగింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగలా చేసుకునేందుకు అన్ని సదుపాయాలు కల్పించడంతో రైతులు వ్యవసాయంపై మొగ్గు చూపారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులను గాలికొదిలేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతంలో యాసంగి మొదలు కాగానే ఖాతాల్లో రైతుబంధు జమ అయ్యేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో యాసంగి సాగుకు అన్నదాతలు మొగ్గు చూపడం లేదు.

*తగ్గిన యాసంగి సాగు విస్తీర్ణం..*

జిల్లాలో 2020-21లో 1,00,387 ఎకరాల్లో.. 2021-22లో 1,03,773 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. 2022-23 యాసంగిలో రైతులు 1,38,378 ఎకరాల్లో పంటలు సాగు చేయగా ఈ ఏడాది యాసంగిలో 1,07,075 ఎకరాల్లో సాగు చేశారు. గత యాసంగితో పోల్చితే ఈసారి 31,303 ఎకరాలు తక్కువగా సాగు చేశారు.



బోసిపోయిన గట్టు మండలంలోని మాచర్ల చెరువు

# ఉత్సాహభరితంగా..

- జడ్చర్లలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం
- ఉమ్మడి పది జిల్లాల నుంచి 160 మంది క్రీడాకారులు రాక
- క్రీడాస్ఫూర్తితో రాణించాలి : ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 26 : క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జడ్చర్లలో అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బాలుర క్రికెట్ పోటీలను ఎంపీ ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు గ్రామీణ క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు జడ్చర్లలో నిర్వహిస్తుండడం ఎంతో సంతోషకరమన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణగా వ్యవహరించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి మొత్తం 160 మంది క్రీడాకారులు పాల్గొనగా పోటీలు ఈనెల 29వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

*రసవత్తరంగా క్రికెట్ పోటీలు..*

జడ్చర్లలోని మినీస్టేడియం, జెడ్పీహైస్కూల్ మైదానాల్లో వేర్వేరుగా క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించారు. మొదటి రోజు వరంగల్‌పై మహబూబ్‌నగర్ జట్టు, నిజామాబాద్‌పై నల్లగొండ, వరంగల్‌పై హైదరాబాద్, కరీంనగర్‌పై ఖమ్మం, మెదక్‌పై రంగారెడ్డి, ఆదిలాబాద్‌పై ఖమ్మం జట్లు విజయం సాధించాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, ఎంఈవో మంజులాదేవి, కౌన్సిలర్లు రఘురాంగౌడ్, సతీశ్, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేశ్‌బాబు, పీడీ శారదాబాయి, పీఈటీలు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



తలపడుతున్న జట్లు